సాక్షి నంద్యాల

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలం: శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి గురువారం పరోక్ష సేవను నిర్వహించారు. నూతన వస్త్ర సమర్పణ చేసి కర్పూరనీరాజనాలు అర్పించారు.



కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లో 0.554 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



ఏసీబీ వలలో ఇద్దరు

నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన ఇద్దరు సిబ్బంది ఓ రైతుకు చెందిన సమస్యను పరిష్కరించేందుకు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. 8లో▸

న్యూస్‌రీల్

వైభవంగా పవిత్రోత్సవం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ: ఎగువ అహోబిలం శ్రీజ్వాల నృసింహ స్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం తెల్లవారు జామున నిత్య పూజల అనంతరం మూలవిరాట్ శ్రీ ఉగ్రనరసింహస్వామి, చెంచు లక్ష్మీ అమ్మవార్లకు పవిత్రమాలలను ధరింపజేశారు. అనంతరం ఉత్సవమూర్తులైన స్వామి అమ్మవార్లను యాగశాలలో కొలువుంచి నవకలశ స్నపనం, ద్వారతోరణ పూజ, మండల ప్రతిష్ట, కుంభ ప్రతిష్ట నిర్వహించారు. అనంతరం వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య పవిత్ర హోమం నిర్వహించారు. రాత్రి ఉభయదేవేరులతో ఉగ్రనరసింహస్వామి విశేష పుష్పాలంకరణలో ఉత్సవ పల్లకీలో విహరించారు.

నేడు దొర్నిపాడులో 'జగనన్నకు చెబుదాం-స్పందన'

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: దొర్నిపాడు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మండల స్థాయి జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించడంలో భాగంగా వారంలో ప్రతి బుధ, శుక్రవారం మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

శ్రీశైలం నుంచి 5,112 క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి బుధవారం నుంచి గురువారం వరకు దిగువ ప్రాంతాలకు 5,112 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 300 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 735, హంద్రీనీవా సుజలస్రవంతికి 1500, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 71.1311 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్‌నీటిమట్టం 845.60 అడుగులకు చేరుకుంది.

రేపు యాగంటి ఆలయం మూసివేత

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయాన్ని ఈ నెల 28న పాక్షిక చంద్రగ్రహణం కారణంగా మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాదికారి రామానుజన్ గురువారం తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు ఆలయ తలుపులు మూసివేస్తునట్లు తెలిపారు. అనంతరం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ చేపట్టి భక్తులకు యథావిధిగా దర్శనాలు కల్పించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

సీపీఓ జేడీపై క్రమశిక్షణ చర్యలు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు సీపీఓ జేడీ ఎల్.అప్పలకొండను తక్షణమే ప్లానింగ్ డిపార్టుమెంట్ రాష్ట్ర కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వ కార్యదర్శి ఎం.గిరిజాశంకర్ గురువారం జీఓ జారీ చేశారు. ఈనెల 18న జిల్లాకు వచ్చిన ఆర్థిక శాఖ మంత్రికి బ్రీఫ్ నోట్స్‌ను అందజేయకపోవడంపై క్రమశిక్షణ చర్యల కింద ఆయనను ఆ పదవి నుంచి తప్పించి ఆ బాధ్యతలను ఏడీ జి.భారతికి అప్పగించారు. కాగా సీపీఓ జేడీ ఎల్.అప్పలకొండ 19న ఎమ్మిగనూరులో జరిగే సీఎం కార్యక్రమానికి సంబంధించిన ప్రొగ్రామ్‌లో భాగంగా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అప్పగించిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తూ బిజీగా ఉన్నారని, సమాచారం లోపంతో ఆయనపై క్రమశిక్షణ చర్యలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసి ఉండవచ్చని కొందరు అధికారులు అభిప్రాయపడ్డారు.

నేడు ఓటరు సవరణ జాబితా విడుదల

కర్నూలు(సెంట్రల్): 2023 జూలై 21 నుంచి ప్రారంభమైన స్పెషల్ సమ్మరీ రివిజన్–2024కు సంబంధించి శుక్రవారం ముసాయిదా జాబితాను విడుదల చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా వివరాలతో ముసాయిదా జాబితాను జిల్లా ఎన్నికల కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే మార్పులు, చేర్పుల కోసం ఈనెల 27 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు ఫిర్యాదులు చేయవచ్చని, తుది ఓటరు జాబితాను 2024 జనవరి 5వ తేదీ విడుదల చేస్తామని పేర్కొన్నారు.

అభివృద్ధికి దారులు

జగనన్న ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి నడుం బిగించింది. పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టి ధ్రువపత్రాలు అందజేసింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా ప్రతినిధులను గ్రామాలకు పంపి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంది. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి చర్యలు తీసుకుంది. ఇప్పుడు రవాణా సౌకర్యాలపై దృష్టిపెట్టింది. రాష్ట్రంలోని పూర్తి అధ్వానంగా ఉన్న రహదారుల వివరాలు ఇవ్వాలని సీఎంఓ కోరింది. దీంతో ఉమ్మడి కర్నూలులోని 39 రోడ్లకు రూ.189.27 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. నేడో రేపో అనుమతుల జీఓలు రానున్నట్లు సమాచారం.

మారనున్న రోడ్ల రూపురేఖలు!

- హై ఇంపాక్ట్ రోడ్ల వివరాలను కోరిన సీఎంఓ
- ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదు రోడ్ల ఎంపిక
- పీఆర్ నుంచి 39 రోడ్లకు రూ.189.27 కోట్లతో ప్రతిపాదనలు
- రాష్ట్రంలో అత్యధికంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకే కేటాయింపు
- రెండు జిల్లాల్లో బాగుపడనున్న 257.79 కిలోమీటర్ల రోడ్లు
- ఆర్అండ్‌బీ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ శాఖల నుంచి కూడా ప్రతిపాదనలు
- నేడో, రేపో విడుదల కానున్న జీఓ



తారు లేచిపోయి కంకర తేలి, గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉన్న ఈ రహదారి కోడుమూరు – గూడూరు వయా చనుగొండ్ల రోడ్డు. దాదాపు 20 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే ఈ రహదారిని గత పాలకులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం బస్సులు కూడా తిరగలేని దుస్థితికి చేరుకోవడంతో ఈ రహదారిలోని 11 కిలోమీటర్ల మేర అప్‌గ్రేడేషన్ చేసేందుకు రూ.6.04 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు.

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత ప్రభుత్వ వైఫల్యంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటి రూపురేఖలను మార్చి ప్రయాణం సుగమం చేసేందుకు జగనన్న ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా రోడ్ల అభివృద్ధికి పీఆర్, ఆర్అండ్ బీ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ కార్పొరేషన్ తదితర ప్రభుత్వ శాఖల ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఒక్కో నియోజకవర్గం నుంచి పూర్తి అధ్వానంగా (హై ఇంపాక్ట్) ఉన్న రోడ్లను ఎంపిక చేసి ప్రతిపాదనలు రూపొందించి పంపించాలని సీఎంఓ కోరింది. ఈ నేపథ్యంలోనే ఆయా ఇంజినీరింగ్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్షించి ప్రతి నియోజకవర్గం నుంచి కొత్త రోడ్లు, బీటీ రెన్యూవల్స్ చేపట్టేందుకు అవకాశం ఉన్న రోడ్ల వివరాలను పంపించారు. అందులో భాగంగా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో 11, నంద్యాల జిల్లాలో 28 (మొత్తం 39) రోడ్ల పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపారు. ఇవి కాక, ఆర్అండ్‌బీ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖల నుంచి కూడా పలు నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు.

39 రోడ్లకు రూ.189.27 కోట్లతో ప్రతిపాదనలు

పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 39 రోడ్లను ఎంపిక చేశారు. ఈ రోడ్లు టీడీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. వీటి స్థానంలో కొత్త రోడ్లను వేసేందుకు, పలు రోడ్లకు బీటీ రెన్యూవల్స్ చేసేందుకు రూ.189.27 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ పనులకు సంబంధించి నేడో, రేపో ప్రభుత్వం జీఓ విడుదల చేయనుందని ఇంజినీరింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నిధులతో కర్నూలు జిల్లాలో 96.61 కిలోమీటర్లు, నంద్యాల జిల్లాలో 161.18 (మొత్తం 257.79) కిలోమీటర్ల మేర రోడ్లు అభివృద్ధి చెందనున్నాయి.



అధ్వానం ఉన్న ఎల్లార్తి - హొళగుంద రోడ్డు

ఇది ఆలూరు – హొళగుంద వయా ఎల్లార్తి రోడ్డు. పూర్తి అధ్వానంగా తయారుకావడంతో ద్విచక్ర వాహనాలు సైతం దెబ్బ తింటున్నాయని వాహనదారులు అక్కడక్కడా దిగి ఒక్కోసారి తోసుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారిలోని 10.16 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేసేందుకు రూ.4.60 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు.

త్వరలో జీఓ ..

సీఎంఓ కోరిన విధంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఆయా నియోజకవర్గాల్లో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా తయారైన రోడ్లను బాగు చేసేందుకు సంబంధిత ఇంజినీరింగ్ శాఖలు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నేడో, రేపో జీఓ విడుదల చేసే అవకాశం ఉంది. ఇప్పటికే ఒకటికి, రెండు సార్లు పూర్తి స్థాయిలో ఏ రోడ్డు ప్రతిపాదించారు ? వాస్తవంగా ఆ రోడ్ల పరిస్థితి పూర్తి అధ్వానంగా ఉందా ? అని నిర్ధారించుకున్నారు. ఈ జీఓ విడుదలైన వెంటనే ఆయా రోడ్ల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టనున్నారు.

జీఓ వచ్చిన వెంటనే టెండర్లు



ఈ పనులకు సంబంధించి జీఓ రానుంది. జీఓ వచ్చిన వెంటనే ఈ పనులు చేపట్టేందుకు రాష్ట్ర స్థాయిలో టెండర్లను పిలవనున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి పూర్తి అధ్వానంగా ఉన్న రోడ్లను ఎంపిక చేసి పంపాలని ప్రభుత్వం కోరిన నేపథ్యంలో పీఆర్, ఆర్అండ్‌బీ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖలు తమ పరిధిలోని రోడ్లను ఎంపిక చేసి అంచనాలు రూపొందించి పంపించాం. పీఆర్ నుంచి ఉమ్మడి జిల్లా నుంచి 39 రోడ్లను ఎంపిక చేశాం. – కె.సుబ్రమణ్యం, పీఆర్ ఎస్ఈ

- పత్తికొండ నియోజకవర్గంలోని మద్దికెర నుంచి ఆలూరు వయా మొలగవెల్లి రోడ్డును గత పాలకులు విస్మరించడంతో గుంతలు పడిపోయి అధ్వానంగా మారింది. ఈ రోడ్డుకు (14.90 కిలోమీటర్ల మేర) రెన్యూవల్స్ చేసేందుకు రూ.8.15 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.
- ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని శిరివెళ్ల మండలం గోవిందపల్లి నుంచి ఇసుకపల్లి వరకు (7.70 కిలోమీటర్లు) రూ.5.55 కోట్లతో బీటీ సర్ఫేస్ కొత్త రోడ్డును వేయనున్నారు.
- బనగానపల్లె మండలం చెన్నంపల్లి నుంచి వయా చిన్న కొట్టాల, నిచ్చెనమెట్ల, అన్నవరం, వేములపాడు మీదుగా జంబులదిన్నె వరకు (12.60 కిలోమీటర్లు) రూ.18.50 కోట్లతో కొత్త రోడ్డును వేసేందుకు ప్రతిపాదనలు పంపారు.



➤ డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలం గుడిపాడు-పీర్ పల్లె రహదారిపై 2.57 కిలోమీటర్ల మేర మరమ్మతుల కోసం రూ.3.40 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు.

నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసిన రోడ్లు...

నియోజకవర్గం	ఎంపిక చేసిన రోడ్లు	కిలోమీటర్లు	మొత్తం (రూ.కోట్లలో)
ఎమ్మిగనూరు	02	9.40	7.32
ఆలూరు	04	30.46	21.70
పత్తికొండ	01	14.90	8.15
కోడుమూరు	04	41.85	25.36
ఆళ్లగడ్డ	06	38.50	26.53
నంద్యాల	03	7.90	5.85
శ్రీశైలం	05	23.30	17.97
బనగానపల్లె	01	12.60	18.50
నందికొట్కూరు	05	38	22.78
డోన్	05	24.78	27.65
పాణ్యం	03	16.10	7.56
మొత్తం:	39	257.79	189.27

ఆర్‌బీకేల్లో ఈ -క్రాప్ జాబితా

- 29వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ
- నవంబర్ 1న తుది జాబితా ప్రకటన



రుద్రవరం మండలం పెద్దకంబలూరులో ఈ -క్రాప్ జాబితాను ప్రదర్శిస్తున్న డీఏఓ మోహన్‌రావు

సాక్షి, నంద్యాల: రైతులు ధీమాగా వ్యవసాయం సాగు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన, మార్కెట్‌లు ధరలు పడిపోయిన సందర్భాల్లో రైతులను ఆదుకునేందుకు పంటల నమోదును తప్పనిసరిగా చేసింది. ఈ మేరకు ఈ -క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తోంది. ఖరీఫ్ సీజన్ ముగిసి పంటలు కోతకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సామాజిక తనిఖీ కోసం ఈ-క్రాప్ అర్హుల జాబితాలను గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు పెట్టారు. రైతుల పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణం, పంట సాగు తదితర వివరాల నమోదులో ఎక్కడైనా పొరపాట్లు చోటు చేసుకుంటే వాటిని సరిచేసుకునేందుకు ఈ నెల 29వ తేదీ వరకు గడువు ఇచ్చారు. అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత నవంబర్ 1న తుది జాబితాను వెల్లడించనున్నారు. ఆర్బీకేల్లో ఈ క్రాప్ నమోదు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారుల ధ్రువీకరణ 100 శాతం పూర్తయ్యింది. రైతుల ఈ కేవైసీ 97 శాతం పూర్తయ్యింది. ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల పంటల సాధారణ విస్తీర్ణం 5,88,181 ఎకరాలు కాగా, 5,51,911 ఎకరాల్లో పంట సాగైంది. సాగైన ప్రతి ఎకరాను అధికారులు ఈ-క్రాప్ పూర్తి చేశారు. 1,87,496 మంది రైతులుంటే వీరిలో 1,79,945 మంది రైతుల ఈ కేవైసీ పూర్తయింది.

పక్కాగా హద్దులు నిర్ధారించి...

నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) సౌజన్యంతో ప్రత్యేకంగా డిజైన్ చేసిన యాప్‌లో ఆధార్, వన్‌బీ, ఆధార్‌తో లింక్ అయిన బ్యాంక్ ఖాతా వివరాలు, ఫోన్ నంబర్, సీసీఆర్సీ కార్డు వివరాలను నమోదు చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత జియో ఫెన్సింగ్ ద్వారా సరిహద్దులు నిర్ధారించి, రైతు ఫొటోను ఆర్బీకే సిబ్బంది అప్‌లోడ్ చేశారు. ఈ క్రాప్‌తో పాటు ఈ కేవైసీ నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రతి రైతుకు రసీదులు అందజేశారు.

మార్పులు ఉంటే ఫిర్యాదు చేయండి

ఆర్‌బీకేల్లో గురువారం నుంచి గ్రామసభలలో అర్హుల జాబితాలను చదివి వినిపిస్తున్నాం. అభ్యంతరాలుంటే ఆర్బీకేలోని వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్‌లకు రాతపూర్వకంగా తెలియజేయాలి. నవంబర్ 1న తుది జాబితా ప్రదర్శిస్తారు. ఆ తర్వాత ఎలాంటి మార్పులకు ఆస్కారం ఉండదు. – మోహనరావు, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

ఎస్ఈఏఎస్ పరీక్షకు సన్నద్ధం చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



పరీక్ష నిర్వహణపై హెచ్ఎంతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల(న్యూటౌన్): అన్ని యాజమాన్య పాఠశాలల్లో 3, 6, 9వ తరగతులు విద్యార్థులకు నిర్వహించే (స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షపై అవగాహన కల్పించి సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని ఎస్పీజీ సెయింట్ జోసెఫ్ పాఠశాలలో విద్యార్థుల ఎస్ఈఏఎస్ ఎగ్జామ్స్ ప్రిపరేషన్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఈఏఎస్ సర్వే కింద ఎంపికైన పాఠశాలలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వారం రోజులు విద్యార్థులతో తప్పనిసరిగా ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండలాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, నియోజకవర్గ స్థాయిలో స్పెషల్ ఆఫీసర్లు కూడా పాఠశాలలను సందర్శించి విద్యార్థుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి సూచనలు చేయాలన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. హెచ్ఎంలు ప్రతిరోజు పరీక్ష విధానంపై అవగాహన కల్పించడంతో పాటు టీచర్ గైడ్‌గా ఉంటూ స్వయంగా ప్రాక్టీస్ చేయించాలన్నారు. ప్రతి రోజూ ప్రాక్టీస్ ఫొటోలను అధికారిక వాట్సప్ గ్రూప్‌లో షేర్ చేయాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా క్రమ శిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాళ మల్లేశ్వరా.. పాహిమాం!



దేవర గట్టు మాళ మల్లేశ్వరస్వామి రథోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా సాగింది. నెరణికి, నెరణికి తండా, కొత్తపేట తదితర గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

- వివరాలు 8లో▸

క్వింటా ఉల్లి రూ.5,318

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి ధర పరుగులు పెడుతోంది. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం ఉల్లి ధర మరింత పెరగడం విశేషం. ఈ నెల 25న మార్కెట్‌లో గరిష్టంగా రూ.4,559 ధర లభించింది. 26న గరిష్టంగా రూ.5,318 పలికింది. అంటే క్వింటాపై రూ.759 పెరగడం విశేషం. కనిష్ట ధర రూ.2,501, గరిష్ట ధర రూ.5,318 ఉండగా.. మోడల్ ధర రూ.4,419 నమోదైంది. ఈ ఏడాది ఉల్లి సాగు ఆశాజనకంగా ఉన్నప్పటికీ వర్షాభావం వల్ల దిగుబడులు తగ్గిపోయాయి. గత ఏడాది ఇదే నెలలో కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు సగటున రోజుకు 3వేల క్వింటాళ్ల ఉల్లి వచ్చింది. ప్రస్తుతం ఈనెల 25న కర్నూలు మార్కెట్‌కు 348 క్వింటాళ్లు రాగా... 26న 777 క్వింటాళ్లు వచ్చింది. వర్షాభావ ప్రభావం ఉల్లిపై ఎక్కువగా ఉండటంతో ధరలు వేగంగా పెరుగుతున్నాయి. మూడేళ్ల క్రితం ఉల్లికి భారీ ధర పలికింది. గరిష్ట ధర రూ.13వేలకు చేరింది. ఈ ఏడాది మార్కెట్‌లో ఉల్లి కొరత ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితి దేశ వ్యాప్తంగా ఉంది. ఉల్లి ధరలు పెరుగనున్నాయని మూడు నెలల కిత్రం నుంచే ప్రచారంలో ఉంది. అందువల్ల వ్యాపారులు క్షేత్రస్థాయికే వెళ్లి ఉల్లి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. కాగా రీటైల్ మార్కెట్‌లో ఉల్లి ధరలు వినియోగదారులకు భారంగా మారుతున్నాయి. రైతుబజారులోనే కిలో రూ.54 నుంచి రూ.60 ప్రకారం విక్రయిస్తున్నారు.

ముందస్తు చలి

- 2022 అక్టోబర్ 26న కనిష్ట ఉష్ణోగ్రత 21.2 డిగ్రీలు
- ఈ నెల 26న కనిష్ట ఉష్ణోగ్రత 16.2 డిగ్రీలు

కర్నూ(అగ్రికల్చర్): చలి ముందే మొదలైంది. కొద్ది రోజులుగా చలి ప్రభావం కాస్త ఎక్కువగానే కనపడుతోంది. సాధారణంగా కార్తీకమాసంతో చలి మొదలవుతుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆశ్వయుజ మాసంలో చలి తీవ్రత పెరగడం ఇదే మొదటిసారి. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే రాత్రి ఉష్ణోగ్రతలు 3–5 డిగ్రీల వరకు తగ్గినట్లు స్పష్టమవుతోంది. 2022 అక్టోబర్ నెల 26న కనిష్ట ఉష్ణోగ్రత 21.2 డిగ్రీలు ఉండగా.. 2023 అక్టోబర్ 26న 16.2 డిగ్రీలకు చేరుకుంది. అంటే ఏకంగా 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రత తగ్గింది. పగటి ఉష్ణోగ్రతలు కాస్త ఎక్కువే ఉన్నప్పటికీ రాత్రి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు తగ్గిపోతున్నాయి. హమూన్ తుపాను ప్రభావం వల్ల చలి ముందస్తుగా ఉత్పన్నమైనట్లు తెలుస్తోంది. ప్రధానంగా రాయలసీమ జిల్లాలకు హమూన్ తుపాను ప్రభావం లేకపోయినప్పటికీ బంగ్లాదేశ్ నుంచి చల్లని గాలులు వీస్తుండటంతో చలి ప్రభావం పెరిగింది. దీనికి తోడు ఈశాన్య రుతుపవనాల ప్రభావం కూడా ఉన్నట్లు సమాచారం. జూన్ నెలలో రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు వెనక్కి వెళ్లిపోయాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి నైరుతి తీవ్ర నిరాశకు గురి చేసింది. ఇదిలాఉంటే తమిళనాడు మీదుగా ఈశాన్య రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాల్సి ఉంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈశాన్య రుతుపవనాల ప్రభావం రాయలసీమ జిల్లాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చలి తీవ్రత ఉంటుందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విభాగం వాతావరణ శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు.



గత ఏడాది అక్టోబర్ నెలతో పోలిస్తే ఉష్ణోగ్రతల తగ్గుదల ఇలా..

తేదీ	2022	2023
	(ఉష్ణోగ్రత డిగ్రీల్లో)	
20	22.8	21.7
21	22.6	21.9
22	22.8	21.6
23	22.1	17.9
24	21.9	16.8
25	21.7	16.4
26	21.2	16.2

క్లుప్తంగా

మల్లన్న సేవలో



అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఐఏఎస్, ఐఎఫ్ఎస్అధికారులు

శ్రీశైలం: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను గురువారం పంజాబ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులు రాహుల్ భండారి, రాఖీ గుప్త భండారీ, ఐఎఫ్ఎస్ అధికారులు భానుమతి, వాసవి త్యాగి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు ఆహ్వానం పలికారు. అనంతరం వారు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలును అందజేశారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు



కూల్‌డ్రింక్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు

కర్నూలు (న్యూసిటీ): తూనికలు, కొలతల శాఖ అధికారులు గురువారం నగర శివారులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ వద్ద కూల్‌డ్రింక్, స్టేషనరీ దుకాణాలను తనిఖీ చేశారు. ఎమ్మార్పీ కన్నా ఎక్కువకు విక్రయిస్తుండటంతో యజమానులపై రెండు కేసులు నమోదు చేసి, రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్ తెలిపారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు వస్తువులు విక్రయించినా, తూనిక యంత్రాలు, రాళ్లకు ముద్రలు లేకపోయినా దుకాణాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఆలూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఆలూరుకు చెందిన చాకలి వెంకటేశ్వర్లు కుమారుడు రఘు(35) ఈనెల 25న కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో హొళగుంద మీదుగా శిరుగుప్పకు బయలుదేరాడు. హొళగుంద – శిరుగుప్ప రహదారిలో ఆటోను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రఘును బళ్లారి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడని బంధువులు తెలిపారు. మృతుడికి భార్య సరస్వతి, కుమారుడు రామ్‌తేజ ఉన్నారు.

రమణీయం..మాళ మల్లేశ్వరుడి రథోత్సవం



భక్తజన సందోహం మధ్య సాగుతున్న రథోత్సవం



రథం ముందు గొరవయ్యల విన్యాసం

హొళగుంద: దేవర గట్టు మాళ మల్లేశ్వరస్వామి రథోత్సవం గురువారం రాత్రి కడు రమణీయంగా సాగింది. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూజారులు రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం కొండపై వెలిసిన ఆలయంలో మాత మాళమ్మ, మల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులకు పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మల్లప్ప గుడిలోని సింహాసన కట్టపై జైత్రయాత్ర అనంతరం అధిష్ఠించిన ఉత్సవమూర్తులకు పురోహితులు అభిషేకాలు, మహామంగళహారతి, ఆకుపూజ నిర్వహించారు. ఆచారం ప్రకారం బిలేహాళ్ గ్రామం నుంచి దేవరగట్టుకు కుంభం, గజమాల చేరడంతో రథాంగ, ఇతర ప్రత్యేక పూజలనంతరం స్వామివారి రథోత్సవాన్ని అశేష భక్త జనుల జయజయ ధ్వనుల మధ్య ఎదురు బసవన్నగుడి వరకు వైభవంగా నిర్వహించారు. రథం, సింహాసన కట్ట ముందు కోలాటాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాన్ని తిలకించడానికి నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులతో పాటు విరుపాపురం, సుళువాయి, బిలేహాళ్, నిట్రవట్టి, కురుకుంద, అరికెర, అరికెర తండా తదితర గ్రామాలు, కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు.



స్వామి అమ్మవార్లకు హారతి ఇస్తున్న పూజారులు

డీసీసీబీ ద్వారా విరివిగా రుణాలిద్దాం

- డీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ద్వారా విరివిగా రుణాలు ఇచ్చేందుకు విధి విధానాలు రూపొందించాలని చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి బ్యాంకు సీనియర్ అధికారులకు సూచించారు. ఇప్పటికే విద్యా రుణాలు పంపిణీ చేయాలని నిర్ణయించామని, రానున్న రోజుల్లో హౌసింగ్ రుణాలు, ఇతర వ్యాపార రుణాలు తదితర రుణాల పంపిణీ చేసి డీసీసీబీని లాభాల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గురువారం జిల్లా సహకార కేంద్రబ్యాంకు సమావేశ మందిరంలో సీనియర్ అధికారులు, పాలకవర్గం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల డీసీసీబీ నుంచి సీనియర్ అధికారులతో ఏర్పాటైన 5 టీమ్‌లు విశాఖపట్టణం, విజయనగరం, కాకినాడ, శ్రీకాకులం, కృష్ణ, గుంటూరు జిల్లాల్లో ఎక్స్‌పోజర్ విజిట్ నిర్వహించి ఆయా జిల్లాల్లో డీసీసీబీలు చేపట్టిన రుణాల పంపిణీ కార్యాక్రమాన్ని అధ్యయనం చేశారు. తమ అధ్యయనం వివరాలను టీమ్ లీడర్లు సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ విజయ మనోహరి మాట్లాడుతూ కొత్త, కొత్త రుణాల పంపిణీ చేయడం లక్ష్యంగా ఐదు టీమ్‌లు వివిధ జిల్లాల్లో అధ్యయనం చేయడం జరిగిందని, వీటి ఆధారంగా తగిన ప్రణాళికలు, విధి విధానాలు ఖరారు చేయాలని సూచించారు. కేవలం వ్యవసాయ రుణాలు మాత్రమే పంపిణీ చేయడం వల్ల బ్యాంకు అంతంతమాత్రం లాభాలకే పరిమితం అవుతుందన్నారు. విద్య, హౌసింగ్, వ్యాపార తదితర రుణాలు పంపిణీ చేయడం వల్ల టర్నోవర్ పెరుగుతుందని, తద్వారా బ్యాంకుకు లాభాలు వస్తాయన్నారు. ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.రామాంజనేయులు మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా సరికొత్త రుణాల పంపిణీ చేపడితేనే వాణిజ్య బ్యాంకుల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవచ్చన్నారు. సమావేశంలో పాలకవర్గం సభ్యులు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరమ్మ, వెంకటరమణారెడ్డి, నాసరి వెంకటేశ్వర్లు, మూలింటి రాఘవేంద్ర, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ఏజీఎంలు త్రినాథ్‌రెడ్డి, కృష్ణమూర్తి, గీత, ఆప్కాబ్ డీజీఎం విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: జగనన్న లేఅవుట్లలో ప్రభుత్వం నిర్దేశించిన నవంబర్ 30 తేదీ నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌హౌసింగ్ ఇంజినీర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని వీసీ హాల్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మంజూరై ప్రభుత్వం నిర్దేశించిన 23,995 ఇళ్ల నిర్మాణాల పూర్తి లక్ష్యానికి గాను నంబర్ 30వ తేదీ నాటికి 13,903 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ప్రతి ఇంజనీరింగ్ అధికారి రోజుకు 421 గృహాలు చొప్పున వివిధ నిర్మాణ దశల్లో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను సీరియస్‌గా తీసుకొని వేగవంతం చేయాలన్నారు. లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తప్పవన్నారు. పూర్తయిన గృహాలకు సోక్ పీట్‌ల నిర్మాణాలు కూడా వెంటనే చేపట్టాలన్నారు. జగనన్న లేఅవుట్‌లో వెల్‌కమ్ ఆర్చ్‌ల నిర్మాణాలు ఎందుకు చేపట్టడం లేదని డీఈలను కలెక్టర్ ప్రశ్నించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున వెల్‌కమ్ ఆర్చ్‌లను ప్రారంభించి వెంటనే పనులు మొదలు పెట్టాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, హౌసింగ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించలేదని యువతిపై కత్తితో దాడి



దాడికి పాల్పడిన చిరంజీవి

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని ఆదోని బైపాస్ రోడ్ అన్నమయ్య సర్కిల్ వద్ద బైక్‌పై వెళ్తున్న యువతి, ఆమె తల్లిపై ఓ యువకుడు కత్తితో దాడి చేసిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలివీ.. పట్టణంలోని లక్ష్మణ్ థియేటర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న యువతి ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో రెండవ సంవత్సరం బీటెక్ చదువుతోంది. గత కొంత కాలంగా పెద్దకడుబూరు మండలం గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన చిరంజీవి ప్రేమించాలని ఆమె వెంటపడుతున్నాడు. బంధువుల పెళ్లి ఉండటంతో గురువారం సాయంత్రం ఆ యువతితో తన తల్లితో కలిసి చీరలు కొనుగోలు చేసి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. విషయం తెలుసుకున్న చిరంజీవి అన్నమయ్య సర్కిల్‌లో కాపుకాసి బైక్‌పై వెళ్తున్న యువతి తలపై రాయితో దాడి చేయడంతో కిందపడిపోయింది. వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేయబోగా తల్లి రావడంతో ఆమెపైనా దాడికి తెగబడ్డాడు. స్థానికులు అడ్డుకోబోగా వారిపైనా దూకుడుగా వ్యవహరించడంతో అందరూ కలిసి దేహశుద్ధి చేశారు. దాడిలో గాయపడిన తల్లీకూతుళ్లను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానికుల దాడిలో గాయపడిన చిరంజీవిని సైతం అదే ఆసుపత్రిలో చేర్చారు. ఘటనపై ఎస్ఐ మస్తాన్‌వలి స్పందిస్తూ అమ్మాయి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు చిరంజీవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రక్తహీనతను నివారించాలి



విద్యార్థినికి ఐరన్ మాత్ర మింగిస్తున్న హేమలత

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తోందని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత చెప్పారు. గురువారం ఆమె నగరంలోని ముజఫర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న విఫ్స్ కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడడం వల్ల రక్తహీనత నివరించవచ్చన్నారు. విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం తర్వాత ఐరన్ మాత్రలను మింగించారు. ఆమె మాట్లాడుతూ శరీరంలో ఐరన్ లోపిస్తే రక్తహీనత ఏర్పడి విద్యార్థులు నీరసం, నిస్సత్తువతో చదువులో వెనకబడిపోతారని పేర్కొన్నారు. అలాగే బా ల్య వివాహాలను నివారించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయుధాలపై అవగాహన అవసరం

- జిల్లా ఎస్పీ కృష్ణకాంత్
- డీపీఓలో రెండు రోజుల పాటు ఓపెన్ హౌస్



ఆయుధాల ప్రదర్శనలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

కర్నూలు: ఆయుధాల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఏటా నిర్వహించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని గురువారం జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో ఆయన ప్రారంభించారు. పోలీసులు వినియోగించే ఆయుధాలు, కమ్యూనికేషన్, ఫింగర్ ప్రింట్ పరికరాలు, ఫాల్కన్ వాహనాన్ని ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా ప్రదర్శనలో ఉంచారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. పోలీసు వ్యవస్థ పనితీరు, దైనందిన విధుల్లో పోలీసులు వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాల గురించి కళాశాల, పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసు శాఖలో చేరాలనుకునే యువకులకు ఈ కార్యక్రమం ఉత్సాహాన్ని కల్పిస్తుందని ఎస్పీ వివరించారు. యుధాల గురించి ఎస్పీతో పాటు అక్కడ ఆర్ఐలు వివరించారు.

ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలు..

డాగ్ స్క్వాడ్ బృందాలు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్, హెచ్‌హెచ్ఎండీ గ్యారెట్, డీఎస్ఎండీ గ్యారెట్, ఎక్స్‌ప్లోజివ్ డిటెక్టర్, డ్రాగన్ లైట్, ప్రోడర్, బాంబ్ డిస్పోజల్ టీమ్, ఎక్స్‌టెన్షన్ మిర్రర్, బాంబ్ సూట్, వెహికల్ ఇన్‌స్పెక్షన్ మిర్రర్, బాంబ్ బ్లాంకెట్, బాంబ్ షీల్డ్, లెడిస్ ఎన్‌క్లోజర్, 410 మస్కట్, 22 రైఫిల్, ఎల్ఈ ఇన్‌ఫీల్డ్ షాట్ మాగజైన్, 303జీఎఫ్ రైఫిల్, 12బోర్ పంప్ యాక్షన్ గన్, 7.62 ఎంఎం ఎస్ఎల్ఆర్, 7.62 ఎంఎం ఎఫ్ఏఎల్, ఏకే 47 రైఫిల్, యూబీజీఎల్, 5.56 ఇన్సాస్ రైఫిల్, 9 ఎంఎం కార్బైన్, 380 రివాల్వర్, 9ఎంఎం పిస్టోల్, గ్లాక్ పిస్టల్, పీఎల్ పిస్టోల్, 303 రైట్ గన్, 1.5 ఫెడరల్ గ్యాస్ గన్, 38 ఎంఎం మల్టీ సెల్ లాంచర్, 51 ఎంఎం మోర్టర్, ఇన్‌స్ట్రక్షనల్ గ్రానైడ్, ఫైబర్ లాఠీ, బీపీ జాకెట్, స్టోన్ గార్డ్, హెల్మెట్, బాడీ ప్రొటెక్టర్, 303 ఎల్ఎంజీ, 7.62 ఎంఎం ఎల్ఎంజీ, ఫాల్కన్ వాహనం తదితర ఆయుధాలను ప్రదర్శనలో ఉంచారు. పలు పాఠశాలల విద్యార్థులు ఆయుధాల ప్రదర్శనలో పాల్గొని వాటి గురించి తెలుసుకున్నారు. శుక్రవారం కూడా ఆయుధాల ప్రదర్శన కొనసాగనుంది. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐలు రమణ, పోతురాజు, ఆర్ఎస్ఐలు, కమ్యూనికేషన్, ఫింగర్ ప్రింట్ సిబ్బంది పాల్గొన్నారు.

మోగనున్న కల్యాణవీణ!

- నేటి నుంచి పెళ్లి ముహూర్తాలు
- సందడిగా మారనున్న మహానంది



మహానంది: రెండు నెలలుగా వివాహాలు, శుభకార్యక్రమాలు నిర్వహించేందుకు ముహూర్తాల కోసం నిరీక్షిస్తున్న వారికి శుభముహూర్తాలు కలిసి వచ్చాయి. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో మంచి ముహూర్తాలు ఉన్నట్లు మహానంది ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. ఈ నెల 27, 28, 29, 30, 31 తేదీలతో పాటు నవంబర్ నెలలో ప్రారంభం నుంచే ముహూర్తాలు ఉన్నాయి. నవంబర్ 1,2, 3, 8, 9, 15, 16, 18, 19, 22, 23, 24, 25వ తేదీల్లో ముహూర్తాలున్నాయి. ఈ ముహూర్తాల్లో పెళ్లిళ్లు జరుపుకునేందుకు వధూవరుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు కల్యాణ మండపాలను ముందుగానే బుకింగ్ చేసుకున్నారు. గత రెండు నెలలుగా శుభకార్యాలు లేక ఖాళీగా ఉన్న సప్లయర్స్, క్యాటరింగ్, డెకరేషన్, అర్చకులు, ఇతర విభాగాల వారీగా రెండు నెలల పాటు ఉపాధి లభించనుంది. ఈ రెండు నెలల్లో ప్రముఖ శైవక్షేత్రమైన మహానందిలో సుమారు వందకు పైగా వివాహాలు జరగనున్నట్లు ప్రాథమిక సమాచారం. శ్రీ మహానందీశ్వరస్వామి, శ్రీ కామేశ్వరీదేవి స్వామివారి సన్నిధిలో కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాలకు చెందిన వారు పెళ్లిళ్లు చేసుకునేందుకు ఆసక్తి చూపుతారు. మహానందీశ్వరస్వామి వారికి నిత్యం కల్యాణోత్సవం జరుగుతుంటుంది. అందులో భాగంగా మహానంది ఆలయంలో పెళ్లిళ్లు జరుపుకునేందుకు భక్తులు మొగ్గు చూపుతారు. గత రెండు నెలల పాటు శుభముహూర్తాలు లేకపోవడంతో వివాహాది శుభకార్యాలకు ఆసక్తి చూపలేదు. అయితే ప్రస్తుతం ఆశ్వీయుజం, కార్తీకం, మార్గశిరం మాసాలు కలిసి రావడంతో శుభముహూర్తాలు అధికంగానే ఉన్నాయి. మహానందిలోని టీటీడీ కల్యాణమండపం, శ్రీ కామేశ్వరీదేవి కల్యాణమండపంతో పాటు పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ హాల్ నందు పెళ్లిళ్లు అధిక సంఖ్యలో జరుగుతాయి. వీటితో పాటు ఆలయ ప్రాంగణంలోని ప్రైవేటు కల్యాణమండపాల్లోనూ అధిక సంఖ్యలో వివాహాలు చేసుకునేందుకు వివిధ జిల్లాల భక్తులు ఆసక్తి చూపుతారు.

ఏఎన్ఎం దుర్మరణం



మృతి చెందిన ఏఎన్ఎం రాజేశ్వరి

డోన్ రూరల్: కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారిపై కొత్తకోట వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఏఎన్ఎం దుర్మరణం చెందింది. రూరల్ ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని కొత్తబురుజు ప్రాథమిక వైద్యశాలలో కొన్నేళ్లుగా ఏఎన్ఎంగా పని చేస్తున్న రాజేశ్వరి (52) ఇటీవల కర్నూలు జిల్లా కోసిగి ప్రభుత్వ వైద్యశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఆమె సొంత పని మీద కొత్తబురుజు ఆసుపత్రికి వెళ్లేందుకు గురువారం ఉదయం డోన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి స్నేహితురాలి కుమారుడు శివ బైక్‌పై కొత్తబురుజుకు వెళ్తూ కొత్తకోట వద్ద రోడ్డును క్రాస్ చేస్తుండగా కర్నూలు నుంచి అనంతపురానికి వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రాజేశ్వరి అక్కడికక్కడే మృతి చెందారు. బైక్ నడుపుతున్న శివకు తీవ్ర గాయాలు కావడంతో డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కర్నూలుకు చెందిన ఖాదర్‌బాషపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

సినిమా థియేటర్‌లో అధికారుల తనిఖీ

ఆత్మకూరు: పట్టణంలోని రంగ మహల్ థియేటర్‌ను గురువారం రెవెన్యూ అధికారులు తనిఖీ చేశా రు. ఈ నెల 20న భగవంత్ కేసరి సినిమా ప్రదర్శన సందర్భంగా థియేటర్ యాజమాన్యం అధిక ధరలకు టికెట్లు విక్రయించినట్లు ఫిర్యాదు అందడంతో అధికారులు స్పందించారు. టిక్కెట్ ధర రూ.70 ఉండగా థియేటర్ యా జమాన్యం రూ.150కు విక్రయించారని కొత్తపల్లి మండలం గుమ్మడాపురం గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి నంద్యాల జిల్లా కలెక్టర్‌కు 1902 నెంబర్‌కు (జగనన్నకు చెబుదాం) ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. థియేటర్‌లో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని కోరారు. దీంతో కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తహసీల్దార్ ఉమాదేవి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది సినిమా థియేటర్‌ను తనిఖీ చేసి ధరలను పరిశీలించారు. ఈ విషయంపై థియేటర్ నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఉమాదేవి మాట్లాడుతూ ఫిర్యాదును పరిశీలించి సినిమా థియెటర్ యజమానిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. సినిమా విడుదల సందర్భంగా టికెట్లు అధిక ధరలకు విక్రయించకూడదని సూచించారు.

అట్టహాసంగా క్రీడా ఎంపిక పోటీలు ప్రారంభం



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాల ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక పోటీలను పాఠశాల హెచ్ఎం అసదుల్లా హుసేన్, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీలు శివకుమార్, లక్ష్మయ్య గురువారం ప్రారంభించారు. అలాగే నంది అకాడమీలో జిల్లా స్థాయి బాలికల అండర్-14, 17 క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాల్ బ్యాడ్మింటన్, రూప్ స్కిప్పింగ్, షటిల్ బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీలు శివకుమార్, లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ఆసక్తి కనబరచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందన్నారు. స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తుందని అన్నారు. విద్యార్థులందరూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. నంద్యాలలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని, ఇందులో క్రికెట్, బేస్‌బాల్, త్రోబాల్, ఫెన్సింగ్, ఖోఖో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల శాప్ కో ఆర్డినేటర్ స్వామిదాసు, రవి, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్, బత్తుల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది

- కలెక్టర్ ఆదేశించినా లంచం డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన రైతు
- జూనియర్ అసిస్టెంట్, డీఆర్ఓ డ్రైవర్ అరెస్ట్



పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డి (చేతులు కట్టుకున్న వ్యక్తి), డీఆర్ఓ డ్రైవర్ ప్రకాష్ రెడ్డి (టోపీ ఉన్న వ్యక్తి)తో ఏసీబీ అధికారులు

నంద్యాల(అర్బన్): పొలానికి సంబంధించిన సమస్యను పరిష్కరించేందుకు రైతు నుంచి లంచం తీసుకుంటూ నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇద్దరు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. కర్నూలు ఉమ్మడి జిల్లా ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి వివరాల మేరకు.. నంద్యాల జిల్లా రుద్రవరం మండలం చిత్తరేనిపల్లె పంచాయతీ పరిధిలోని ఆలమూరు గ్రామానికి చెందిన రైతు బరిగెల చిన్నప్ప తన 3.20 ఎకరాల భూమిని చుక్కల నుంచి తప్పించాలంటూ కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. పరిశీలించిన కలెక్టర్ రికార్డుల్లో రైతు భూమిపై ఉన్న చుక్కను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఈ ఏడాది జూలై 13న చిన్నప్ప డీఆర్ఓ కార్యాలయానికి చేరుకొని అధికారులను విషయాన్ని చెప్పాడు. అయితే రూ.30 వేలు ఇస్తే పని అవుతుందని కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డి తేల్చి చెప్పాడు. అంత మొత్తం చెల్లించుకోలేనని చెప్పినా రికార్డుల్లో చుక్క తొలగించలేదు. నెలలు గడుస్తున్నా తన సమస్య పరిష్కారం కాకపోవడంతో చిన్నప్ప ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు చిన్నప్ప రూ.20 వేలు ఇచ్చేందుకు జూనియర్ అసిస్టెంట్‌తో బేరం కుదుర్చుకున్నారు. గురువారం రూ.5వేలు తెచ్చి జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఇవ్వబోయాడు. అయితే కార్యాలయం కింద కూల్‌డ్రింక్ షాపు వద్దకు డీఆర్ఓ డ్రైవర్ ప్రకాష్‌రెడ్డి వస్తాడని, అతని చేతికి డబ్బులు ఇవ్వాలని జూనియర్ అసిస్టెంట్ చెప్పారు. ఈ మేరకు డ్రైవర్ ప్రకాష్‌రెడ్డి డబ్బులు తీసుకొని కిరణ్‌కుమార్‌రెడ్డికి ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి, ఇన్‌స్పెక్టర్లు కృష్ణారెడ్డి, కృష్ణయ్య, వంశీనాథ్, ఇంతియాజ్‌బాషాలు రెడ్‌హ్యాండెడ్‌గా ఇద్దరిని పట్టుకున్నారు. బాధితుడు చిన్నప్ప ఫిర్యాదు మేరకు జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డ్రైవర్ ప్రకాష్‌రెడ్డిలను అరెస్ట్ చేశామన్నారు. గతంలో అవుకు సబ్‌రిజిస్ట్రార్‌లో విధులు నిర్వహిస్తుండగా ఇటువంటి కేసుల్లోనే కిరణ్‌కుమార్‌రెడ్డి అవినీతికి పాల్పడి అరెస్ట్ అయ్యారన్నారు. ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడితే 14400 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు.